

పోలీసులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం (ఫైల్)

గుట్టుగా.. దందా!

కొత్తగూడ ఉమ్మడి మండలంలో అక్రమ వ్యాపారాలు

- యథేచ్ఛగా పీడీఎస్ బియ్యం రవాణా
- జోరుగా గుట్కా, అంబరు బిజినెస్
- చాపకింద నీరులా పాకుతున్న గంజాయి
- ఏజెన్సీలో మత్తుకు చిత్తవుతున్న యువత
- చోద్యం చూస్తున్న పోలీసు యంత్రాంగం
- ఎస్పీ దృష్టి సారించాలని ప్రజల విజ్ఞప్తి

పచ్చని చెట్లు.. పారే సెలయేర్లు.. పల్లె జీవనంతో అలరాలే ఏజెన్సీ పల్లెలు.. అక్రమ దందాలకు నిలయాలుగా మారిపోయాయి. ఆదివాసీల గూడాలు ప్రస్తుతం గంజాయి కేంద్రీకృతంగా మారిపోయాయి. కొంతమంది అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా యువతను అక్రమ వ్యాపారాల రొంపిలోకి లాగి సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన యువత.. మత్తులో జోగుతోంది. అరికట్టాల్సిన సంబంధిత అధికారులు, పోలీసులు మామూళ్ల మత్తు, నిర్లక్ష్యపు జబ్బులతో కొట్టుమిట్టాడుతుండడంతో ఏజెన్సీలో అక్రమ వ్యాపారాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

కొత్తగూడ, ఆగస్టు 25 : కొత్తగూడ ఉమ్మడి మండలం ఇప్పుడు దందాలకు వేదికైంది. గుట్కా, గంజాయి, ప్రజా పంపిణీ బియ్యం, బెల్లం, గుడుంబా విక్రయాలకు కేంద్రంగా మారింది. కొందరు వ్యాపారులు ఏజెన్సీలో యథేచ్ఛగా వ్యాపారాన్ని సాగిస్తూ లక్షలు గడిస్తున్నారు. అమాయక యువత దీనికి బలవుతూ భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారు.

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా..

కొత్తగూడ, గంగారం మండలాల్లో ప్రజల కోసం రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యంను కొందరు అక్రమార్కులు ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. గ్రామాల్లో నిరుద్యోగ యువతను ఏజెంట్లుగా మార్చుకుని వారి దందాను కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో బియ్యం పంపిణీ చేయగానే వారి వద్దకు వెళ్లి కిలోకు రూ.6 నుంచి 10 చొప్పున చెల్లిస్తూ సేకరిస్తున్నారు. ఆపై వారి వద్దనే బియ్యాన్ని డంప్ చేసుకుంటున్నారు. బియ్యంను తీసుకెళ్లే భారీ వాహనాలు వచ్చి మండల శివారు ప్రాంతాల్లో నిలపగానే ఏజెంట్లు ఇంటింటి నుంచిచిన్నవాహనాలు, ద్విచక్రవాహనాల ద్వారా భారీ వాహనం వద్దకు చేరవేస్తూ అక్కడే లోడ్ చేస్తున్నారు. ఏజెంట్లు వాహనాలను మండల సరిహద్దులు దాటిస్తున్నారు. కొత్తగూడ మండలంలో గుండంపల్లి, కొత్తగూడ, కార్లాయి మార్గాల ద్వారా.. అలాగే గంగారం మండలం దుబ్బగూడెం, పూనుగొండ్ల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల, ఇల్లందు నుంచి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.

- కొత్తగూడ మండలం తాటివారివేంపల్లి, గోపాలపురం, బత్తులపల్లి, కార్లాయి, ఈశ్వరగూడెం గ్రామాల నుంచి సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని కార్లాయి, గూడూరు మండలం మట్వాడ గ్రామాల మీదుగా ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు సమాచారం.
- గంగారం మండలం నుంచి వారం కిందట ఆటో ద్వారా ఇతర ప్రాంతాలకు బియ్యం తరలిస్తుండగా గంగారం వద్ద వాహనాల రాకపోకలతో అప్రమత్తమైన అక్రమరవాణా దారులు బియ్యాన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోగా, పోలీసులు స్వాధీనం చేసుకుని, ఆ దందాపై విచారణ కొనసాగుస్తున్నట్లు తెలిసింది.
- కొత్తగూడమండలం పొగుళ్లపల్లిలో శుక్రవారం రాత్రి బొలెరో వాహనంలో 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. అవే కాకుండా చిరు వ్యాపారాల పేరుతో మండలంలోకి ద్విచక్రవాహనాలపై వచ్చి పీడీఎస్ బియ్యంను తరలిస్తున్నారు. గతంలో బియ్యంను తరలిస్తున్న ద్విచక్రవానాలను పోలీసులు స్వాధీనం చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. అయిన బియ్యం దందా మాత్రం ఆగటం లేదు..

యథేచ్ఛగా గుట్కా వ్యాపారం

ప్రభుత్వం గుట్కా, అంబర్, ఇతర మత్తు పదార్థాలపై నిషేధం విధించడంతో కొత్తగూడ, గంగారం మండలాల్లో గుట్కా, అంబర్ వ్యాపారం గుట్టుగా సాగుతోంది. కొత్తగూడ మండలానికి కొత్తగూడ, గంజేడు, గుండం గ్రామాల నుంచి, గంగారం మండలానికి గుండాల, ఇల్లందు మార్గాల గుండా గుట్కా, అంబర్ ప్యాకెట్లను అక్రమంగా తీసుకువస్తున్నారు. మండలాల సరిహద్దులోనికి గుట్కా డీలర్లు తమ వాహనాలను తీసుకువచ్చి స్థానిక వ్యాపారులకు చేరవేస్తుండగా, వారు ఆ మత్తు పదార్థాలను గుట్టుగా మండలాల్లోని గ్రామాలలో విక్రయిస్తున్నారు. అయితే మొదట్లో పోలీసులు తనిఖీలు చేసి, పలువురు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. ఇటీవల పోలీసులు స్తబ్దుగా ఉండడంతో మండలాల్లో గుట్కా వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నట్లు సమాచారం.





గుడుంబా, బెల్లం పానకం, గుట్కా అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)

ఆగని బెల్లం, గుడుంబా దందా..

మహబూబాబాద్ జిల్లాలో గుడుంబా, దందాలను అరికట్టాలని ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు పలుమార్లు తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నా.. కొత్తగూడ, గంగారం మండలాల్లో మాత్రం గుడుంబా, బెల్లం దందా మాత్రం కొనసాగుతూనే ఉంది. కొందరు బెల్లం వ్యాపారులు మండలానికి రాత్రివేళల్లో భారీ వాహనాల్లో బెల్లం తరలిస్తున్నారు. కొందరు బెల్లం, చక్కెరతో

మిగతా 8వ పేజీలో..

అక్రమ వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవు

- తిరుపతిరావు, మానుకోట డీఎస్పీ




“పీడీఎస్ బియ్యం, గుట్కా, గుడుంబా, బెల్లం వంటి అక్రమ వ్యాపారాలు చేసినా.. గంజాయి, డ్రగ్స్ విక్రయాలు చేస్తే కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు విధిస్తాం. ఇప్పటికే కొంత మందిపై కేసులు నమోదు చేశాం. యువత చెడువ్యసనాల బారిన పడకుండా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాం. యువతను గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నుంచి దూరం చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. అక్రమ వ్యాపారాలు చేసినా, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.”



మానుకోటలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు (ఫైల్)

ముకుందా.. ముకుందా..

- నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి
- శ్రీకృష్ణుని ప్రతిమలకు ప్రత్యేక పూజలు
- ఉత్సాహంగా జరుపుకోనున్న యాదవులు
- ఉట్టికొట్టే కార్యక్రమంతో ముగింపు
- వేడుకలు నిర్వహించేందుకు యువజన సంఘాల ఏర్పాట్లు



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 25 : జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహణకు యాదవ కులస్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాట్లను పూర్తి చేశారు. హిందూ పంచాంగం ప్రకారం.. ఏటా శ్రావణమాసం కృష్ణపక్షంలో వచ్చే అష్టమి తిథినాడు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆనందోత్సవాల మధ్య జరుపుకుంటారు. ఈ పవిత్రమైన రోజున యువత ప్రపంచ వ్యాప్తంగా సన్మాష్టమి, గోకులాష్టమి వేడుకలను జరుకుంటారు. శ్రీకృష్ణాష్టమి రోజున చిన్నారులను శ్రీకృష్ణుని వేషధారణలో తయారు చేసి పూజిస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించిన వారికి కోరిన కోరికలు నెరవేరుతాయని ప్రతీతి. ఈ నేపథ్యంలోనే శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం (నేడు) జరుపుకునేందుకు ప్రజలంతా సంసిద్ధులయ్యారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి రహస్యం..

భాగవతం ప్రకారం.. పరమ రాక్షసుడైన కంసుని చెల్లెలు దేవకి తనకి ఆమె అంటే ఎంతో ఇష్టం. తనకు వసుదేవుడితో వివాహం జరిపించి అత్తారింటికి పంపే సమయంలో ఆకాశవాణి తనచెల్లెలు కడుపులో ఎనిమిదో సంతానంగా పుట్టిన కుమారుడు కంసుడుని అంతమొందిస్తాడని చెబుతుంది. దీంతో ఆగ్రహానికి గురైన కంసుడు తనచెల్లెలు దేవకి బావ వసుదేవులను కర్మాగారంలో బంధిస్తాడు. వారికి పుట్టిన బిడ్డలని పురిట్లోనే చంపేస్తుంటాడు. ఏడుగురు చిన్నారులను కోల్పోయిన దేవకి ఎనిమిదవ గర్భం దాలుస్తుంది. ఆబిడ్డ తనఅంతు చూస్తాడని కంసుడికి ముందే తెలుసు. కాబట్టి కారాగారం వద్ద భద్రతను మరింత పెంచుతాడు. అయితే నెలలు నిండిన దేవకి శ్రావణమాసంలో బహుళ అష్టమి రోహిణి నక్షత్రం వేళ అర్ధరాత్రి శ్రీకృష్ణుడు జన్మించాడు. ఆ రోజును శ్రీకృష్ణాష్టమి, జన్మాష్టమి, గోకులాష్టమి, అష్టమి రోహిణి పిలుస్తారు.

సామూహిక వేడుకలు యాదవుల ప్రత్యేకం..

యాదవ కులస్థులు కృష్ణుడిని కులదైవంగా కొలుస్తారు. కృష్ణాష్టమి రోజున ప్రత్యేక పూజలు చేసి గ్రామాలు, పట్టణాల్లో వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కృష్ణాష్టమి రోజున ఊయలలో కృష్ణుడి ప్రతిమలను ఉంచి, కన్నులపండువగా జన్మదిన వేడుకలు నిర్వహిస్తారు. తమ చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణలతో అందంగా ముస్తాబుచేస్తారు. కృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ముగింపు ఘట్టంగా నిర్వహించి, సహపంక్తి భోజనాలతో వేడుకలు ముగిస్తారు. ఉట్టి కొట్టే

మిగతా 8వ పేజీలో..



మాట్లాడుతున్న బానోత్ శంకర్‌నాయక్

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

గూడూరు, ఆగస్టు25 : కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ కార్యకర్తలు ఎండగట్టాలని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. గూడూరు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి అతి తక్కువ సమయంలోనే ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందన్నారు. రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేసిందన్నారు. ఏకకాలంలో రూ.లక్షల రుణమాఫీ చేయలేదని చెప్పారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దృష్టిసారించాలని, గెలిచే అభ్యర్థులనే ఎంపిక చేసి బరిలో నిలపాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్‌లో వర్గ విభేదాలు ఉన్నాయని, అధిష్ఠానం చొరవ తీసుకుని క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, కార్యదర్శి నూకల సురేందర్, అధికార ప్రతినిధి బానోత్ నర్సింహానాయక్, మాజీ వైస్ఎంపీపీ ఆరె వీరన్న, సంపత్‌రావు, కటార్‌సింగ్, రహీం, నాగరాజు, కుమారస్వామి, రాములు పాల్గొన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి

కొత్తగూడ, ఆగస్టు 25 : జ్వరంతో చిన్నారి మృతి చెందిన సంఘటన హనుమాన్‌తండాలో జరిగింది. వివరాల ప్రకారం. హనుమాన్‌తండాకు చెందిన భూక్య రాజేందర్, సంధ్య దంపతుల కూతురు రూపా (18నెలలు)కు గత వారం రోజులుగా జ్వరం వస్తుండటంతో వరంగల్ జిల్లా నర్సంపేటలోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఆదివారం మళ్లీ జ్వరం రావడంతో నర్సంపేటలోని ఆస్పత్రికి తీసుకుని వెళ్లారు. చిన్నారి ఆరోగ్యం విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తీసుకెళ్లేందుకు సిద్ధం అవుతుండగా చిన్నారి మృతి చెందినట్టు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

డోర్నకల్, ఆగస్టు 25 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధులు దరిచేరవని మునిసిపల్ ఛైర్మన్ వాంకుడోతు వీరన్న అన్నారు. ఆదివారం డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పిచ్చి మొక్కలు తొలగించడానికి డోజర్‌ను తెప్పించి, శుభ్రం చేయించారు. పాఠశాలలో పిచ్చి మొక్కలు పెరగడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయని చెప్పారు. దీంతో విద్యార్థినులు విషజ్వరాల బారిన పడే ప్రమాదముందని చెప్పారు. ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ప్రజల కోసం ప్రభుత్వంతో పోరాడతాం..

- హైడ్రా నుంచి సామాన్యులకు విముక్తి కల్పించాలి
- పార్టీ ఫిరాయిస్తే ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

బాలసముద్రం, ఆగస్టు 25 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మిత్ర పక్షంగా ఉంటూనే ప్రజల సమస్యల కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడే కమ్యూనిస్టు పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుని నల్లగొండ, ఖమ్మంలో ఎక్కువ సీట్లు గెలుపొందిందన్నారు. కానీ సీపీఐతో మిత్రబంధం పాటించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎక్కువ హామీలు ఇచ్చి పట్టించుకోవడంలేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. మంత్రుల మధ్య సమన్వయ లోపంతో ఒకరు చెప్పిన మాటకు మరొకరు చెప్పిందానికి సంబంధం ఉండడంలేదని అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయకపోయినా ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై రాళ్లు వేస్తున్నారని అన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల వరకు వెంటనే రుణమాఫీ చేయాలని, లేకుంటే రైతులు రుణమాఫీపై రైతులు ధర్నాలు చేస్తే సీపీఐ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో సామన్య ప్రజలు భయపడుతున్నట్లు, హైడ్రా నుంచి సామాన్యులకు విముక్తి కల్పించాలని సూచించారు.

బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ వీడేందుకు ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రస్తుత విలువలు లేని రాజకీయాలు ఎవరు చేసినా మంచి పద్ధతి కాదన్నారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేలపై చర్యలు ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపులకు పాల్పడితే సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. గ్రామాలలో అభివృద్ధి కుంటుపడిందని, రాష్ట్రంలో రూ.70వేల కోట్ల పెండింగ్ బకాయిలు ఉన్నాయని అన్నారు. ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్యం అందక పేదలు ఇబ్బందులు పడు తున్నట్లు తెలిపారు. గడిచిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల సమస్యలపై జరిగే చర్చకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డుప డినట్లు తెలిపారు. పాలక, ప్రతిపక్షాలు జుగుప్సాకరమైన పదజాలం ఉపయోగించడం మంచి పరిణామం కాదని, గతంలో బీఆర్ఎస్ తప్పులు చేయడం వల్లే ప్రజలు తిరస్కరించినట్లు గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే సెప్టెంబరు 17న తెలంగాణ సాయు ధపోరాట అమరవీరుల దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కూనంనేని సాంబశివరావు కోరారు. సినీ నటుడు నాగార్జున ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇంటి నిర్మాణాలు చేస్తే కూలగొడితే మంచిదే కానీ.. గూడు లేని పేదల ఇండ్లు కూల్చవద్దని అన్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, భూకబ్జాలు చేస్తే అక్రమాలను బయటకు తీయాలని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు.

కాగా, హనుమకొండలో గురువారం నుంచి శనివారం వరకు సీపీఐ మూడురోజులు రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు నిర్వహించి జాతీయ నాయకుల సూచనలతో పలు తీర్మానాలు చేసినట్లు ఆయన తెలిపారు.

భూకంపం సృష్టించైనా బీసీల రిజర్వేషన్లు సాధిస్తాం..

- సీఎం పీఠంపై బీసీలు కూర్చోవాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- కాజీపేటలో బీసీల సమర శంఖారావం



మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

కాజీపేట, ఆగస్టు 25 : బీసీలకు దామాషా ప్రకారం అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే భూకంపం సృష్టిస్తామని పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. రాబోయేది బీసీల సర్కారేనని, బీసీలు సీఎం పీఠంపై కూర్చోవాల్సిందేనని అన్నారు. హనుమకొండ జిల్లా కాజీపేటలో ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం బీసీల సమర శంఖారావం కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముందు బీపీ మండల్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం 'సామాజిక న్యాయమే.. బీసీ నాదము-బీసీ వాదము' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాజీ 'కుడా' ఛైర్మన్ సుందర్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై తీన్మార్ మల్లన్న మాట్లాడారు.

బీసీలకు అన్నిరంగాల్లో రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. ఈ మేరకు హామీ ఇచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. తన మాటను నిలుపుకోవాలన్నారు. రాష్ట్రంలో కుక్కలు, పందులు ఎన్నున్నాయో లెక్కుంది కానీ.. బీసీలు ఎంతమంది ఉన్నారో లెక్కలేదని వ్యాఖ్యానించారు. మీరు లెక్కకడుతారా.. మేమే మిమ్మల్ని లెక్కకట్టాలా.. అని అగ్రకులాలనుద్దేశించి అన్నారు. బీసీలకు న్యాయం జరిగేంతవరకు తాను మాట్లాడుతూనే ఉంటానన్నారు. బీసీల న్యాయం కోసం అవసరమైతే కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. యుద్ధం ప్రారంభమైందని, ఇది తీన్మార్ మల్లన్న అంతిమయాత్ర వరకు కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో 60 శాతం మంది బీసీలుంటే.. ఆరుగురికి మాత్రమే మంత్రి పదవులు వచ్చాయన్నారు. బీసీల పక్షాన రెడ్డి, వెలమ, బ్రహ్మణుల మద్దతు తీసుకుంటామని, ఇది పోరాటాల గడ్డ వరంగల్ నుంచే పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తన పదవి బిచ్చమెత్తి తెచ్చు కోలేదని, బెదిరించి తెచ్చుకున్నానని తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు.

అంతకుముందు బీపీ మండల్ మనవడు సూరజ్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీల సర్కార్ రావాలన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. తెలంగాణలో రెడ్డిలే ముఖ్యమంత్రులవుతున్నారన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు మాట్లాడుతూ... బీసీ ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. ఓరుగల్లు అంటేనే ఉద్యమాల ఖిల్లా అని, ఉద్యమం ఇక్కడినుంచే ప్రారంభం కావాలన్నారు. పిడికెడు మందితో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమంతో రాష్ట్రాన్ని సాధించామని, అలాగే బీసీల ఉద్యమం కూడా విజయం సాధిస్తుందన్నారు. బీసీ నాయకులు కన్నెబోయిన రాజయ్య యాదవ్, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, క్రాంతి, సుశీల, ఎల్లావుల లలితా యాదవ్, ఈగ మల్లేశం, డాక్టర్ వినయ్‌తో పాటు బీసీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆ.. పత్రికకు 102 ఏళ్లు

- నిజాం నిర్బంధకాలంలో ప్రజలను చైతన్యపరిచిన 'తెనుగు' పత్రిక
- మారుమూల గ్రామంలో స్థాపించిన ఒద్దిరాజు సోదరులు
- ఇక్కడి నుంచి అనేక ప్రాంతాలకు పోస్టాఫీస్ ద్వారా సరఫరా
- రేపు ఇనుగుర్తిలో శతాబ్ది వేడుకలు



7

'ఆశాల సమస్యలను పరిష్కరించాలి'

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 25 : ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆ సంఘం యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి కోరారు. మహబూబాబాద్ సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం 'ఆశా వర్కర్ల సమస్యలు, ప్రభుత్వ విధానాలు, పరిష్కార మార్గాలు' అనే అంశంపై ఆశా వర్కర్లకు జిల్లాస్థాయి ఒక్కరోజు రాజకీయశిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లు గత 20 ఏళ్లుగా నేషనల్ హెల్త్ మిషన్ స్కీం కింద పనిచేస్తున్నట్లు చెప్పారు. మాతా శిశు మరణాల రేటును తగ్గించడంలో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 9న మహబూబాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, రమణ, ఉపేంద్ర, రమాదేవి, స్వరూప, నీలిమ, కౌసల్య, జ్యోతి, విజయ, కుమ్మరికుంట్ల నాగన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాసు మాధవి

ఔషధ గుణాల గాడిద పాలు

● 10 మి.మీ. రూ.100కు అమ్మకం ● ఇంటి వద్దకే విక్రయాలు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 25: గాడిద పాలను చిన్నారులకు తాగించేందుకు నగరవాసులు అమితాసక్తిని కనబర్చుతున్నారు. పలు ఔషధ గుణాల కలిగిన గాడిద పాలను చిన్నారులకు తాగించడం ద్వారా జన్యు పరమైన లోపాలు, అనారోగ్య సమస్యలు దూరం చేస్తూ ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ప్రచారంలో ఉంది. కేవలం 10 మిల్లీలీటర్ల గాడిద పాలకు రూ.100 తీసుకుంటున్నారు. అక్కడే పిండి విక్రయాలు చేస్తున్నారు. పాల ఖరీదు ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. హనుమకొండలో కొందరు వీధి వీధికీ గాడిదలను తిప్పుతూ ఇళ్ల వద్దకే వచ్చి అక్కడే పాలను పిండి విక్రయిస్తున్నారు.

జీవనాధారం

తాతలు, తండ్రి వారసత్వంగా గాడిదలను పెంచి పాలను విక్రయిస్తూ దాదాపు 15ఏళ్లుగా జీవనోపాధి పొందుతున్నట్లు గాడిద పాల విక్రయదారుడు జమ్మికుంటకు చెందిన కోట రవి అనే వ్యక్తి చెబుతున్నాడు. రోజంతా నగరంలోని పలు కాలనీలలో మైకులో ద్వారా ప్రచారం చేస్తూ గాడిద పాల విక్రయిస్తున్నా మన్నారు. రోజుకు సుమారు రూ.800 నుంచి రూ.1000 రాగా, అందులో నుంచి గాడిద దాణాకు రూ.300 వరకు ఖర్చులు పోగా.. మిగిలిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిపాడు. ఇటీవల కాలంలో చాలాచోట్ల కొందరు గాడిదల ఫామ్‌లు పెట్టి పాల విక్రయాలు చేస్తూ ఉపాధి పొందుతున్నారని చెప్పారు.


గాడిద పాలు విక్రయిస్తున్న దృశ్యం


బొడ్రాయి కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వాణిదేవి, ప్రముఖులు

రచయితలే సమాజాన్ని చైతన్యం చేసేది

బొడ్రాయి కథా సంపుటి ఆవిష్కరణలో ఎమ్మెల్సీ వాణిదేవి

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 25: సమాజాన్ని చైతన్య వంతం చేసే బాధ్యత ముమ్మాటికీ రచయితలదేనని ఎమ్మెల్సీ సురభి వాణిదేవి అన్నారు. ఆదివారం వడ్డేపల్లిలోని పీఆర్ రెడ్డి భవన్‌లో చక్రవర్తుల రాధాకృష్ణ సాహితీ వేదిక అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సాహిత్య కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణిదేవి, ఉపాధ్యాయురాలు, రచయిత్రి రావుల కిరణ్మయి కలం నుంచి జాలువారిన బొడ్రాయి కథా సంపుటితో పాటు పీవీ నర్సింహరావు ఉయ్యాల పాట గ్రంథాలను ఆమె ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వాణిదేవి మాట్లాడుతూ.. పాట రూపంలో పీవీ చరిత్ర రాయడం గొప్ప ప్రయోగమని పేర్కొన్నారు. కవులు, రచయితలు సమాజ పక్ష సాహిత్యాన్ని సృజింప చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. రియాజ్ మాట్లాడుతూ.. కిరణ్మయి కథలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయన్నారు. పీవీ ప్రపంచ ఆస్తి అని, ఎంత సాహిత్యం సృజించినా తక్కువేనన్నారు. పల్లె జీవితంపై తెలంగాణ భాష, యాసపై పట్టుతో మంచి గ్రంథాలు వెలువరించిన రాధాకృష్ణ సాహితీ వేదికను ప్రశంసించారు. డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, జానపద విజ్ఞాన శాస్త్ర వేత్త ఆచార్య ఎన్. భక్తవత్సల్‌రెడ్డి, రావుల పుల్లాచారి, డాక్టర్ గడ్డం వెంకన్న, ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ గ్రంథాలను బీవీఎన్ స్వామి, మెరుగు అనురాధ తమదైన శైలిలో అద్భుతంగా సమీక్షించారు. కళా రాజేశ్వర్‌రావు, బిల్ల మహేందర్, పీవీ మదన్‌మోహన్, బాలబోయిన రమాదేవి, కానుగుల భద్రయ్య, గుండు రవి, తదితర అనేక మంది భాషా పండితులు పాల్గొన్నారు.

కొత్తకొండ దేవాలయ ముఖ్య అర్చకుడికి స్వర్ణకంకణం ప్రదానం

భీమదేవరపల్లి, ఆగస్టు 25 : మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయ ముఖ్య అర్చకుడు మొగిలిపాలెం రాంబాబు దంపతులకు తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్టు జాతీయ కార్యదర్శి దైవజ్ఞశర్మ స్వర్ణకంకణంతో పాటు అవార్డును ఆదివారం అందజేశారు. తెలంగాణ నుంచి భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ముఖ్య అర్చకుడిగా పనిచేస్తున్న రాంబాబును ఎంపిక చేశారు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో నక్షత్ర దీక్షలు ప్రారంభించి పలువురు భక్తులకు వీరభద్రస్వామి మాలలను గత 20 ఏళ్ల నుంచి రాంబాబు చేస్తున్నాడు. దీనికి గుర్తింపుగా మొగిలిపాలెం రాంబాబు ధర్మపత్ని లలితాదేవిలను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం ఘనంగా సన్మానించి స్వర్ణకంకణాన్ని ప్రదానం చేశారు. అనంతరం మొగిలిపాలెం రాంబాబు-లలితాదేవి దంపతులను హైద్రాబాద్‌లోని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు తమ ఇంటికి రప్పించి ఘనంగా సన్మానించారు.


రాంబాబుకు స్వర్ణకంకణం తొడుగుతున్న నిర్వాహకులు

ఐకార్ గుర్తింపు ఎస్సార్‌యూ సన్నద్ధం

హసన్‌పర్తి, ఆగస్టు 25: మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల ఐకార్ గుర్తింపు కోసం సన్నద్ధమైనట్లు ఎస్సార్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జి.భూపాల్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏ వ్యవసాయ కళాశాల భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకునేందుకు కనీసం మొదటి బ్యాచ్ విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఎస్సార్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులు విజయవంతంగా డిగ్రీలు పొందడంతో ఐకార్ గుర్తింపు కోసం దరఖాస్తు చేయడానికి అవసరమైన ప్రమాణాలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇప్పుడు ఎస్సార్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతుందని తెలిపారు. ఈ కళాశాలలో విభాగాల వారీగా బోధనా, బోధనేతర సిబ్బంది, ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, ప్రదర్శన కృషి ఫారమ్ సౌకర్యాలున్నాయని తెలిపారు. ఇవి డీన్స్ కమిటీ భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి మార్గదర్శకాలతో అనుగుణంగా ఉన్నాయన్నారు. ఐకార్ గుర్తింపు పొందడానికి అన్ని అర్హతలున్నాయని, ఈగుర్తింపు ద్వారా విద్యా ప్రమాణాలు మరింత బలపడి వ్యవసాయరంగానికి విశేష కృషి చేసేలా కళాశాల సన్నద్ధమవుతుందని తెలిపారు.

ఆటో డ్రైవర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న రవికుమార్

వడ్డేపల్లి, ఆగస్టు 25 : ఆటో డ్రైవర్ల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక ఆటో డ్రైవర్ల కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులు వెంటనే ప్రకటించాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుడిమళ్ల రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం జాక్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి రాజు అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గుడిమళ్ల రవికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని ఆరులక్షల మంది ఆటో డ్రైవర్లు, వారి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నారని, వారిని ఆదుకునేందు కోసం తక్షణమే ప్రతీ ఆటో డ్రైవర్‌కు ప్రతీ ఏటా రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. జీవిత బీమా ప్రభుత్వమే కల్పించడంతో పాటు ఆటో రిక్షాలపై ట్రాఫిక్, ఫెనాల్టీని వెంటనే నిలిపివేయాలని అన్నారు. ఆటోడ్రైవర్లపై ఫైనాన్షియర్ల దాడులను అరికట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు రవికుమార్ తెలిపారు. ఈ సమావేశంలో టీఏడీయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘం మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉయ్యాల ప్రవీణ్, బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ అబీబ్, జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు జేరిపోతుల కుమార్, శానబోయిన రాజ్‌కుమార్, మోడెం విద్యాసాగర్, దార మధు, చల్ల విక్రమ్, కట్ట రాంకుమార్, అకినపల్లి అంజయ్య, మర్రి కృష్ణ, మద్దెల రాజేందర్, ఆవుల నవీన్, పిల్లి ఆనంద్, మాతంగి శివరాజ్, ఆమంచ ప్రశాంత్ , ఆకుల వెంకటేశ్వర్లు, గుండాల రాజు, పెసరు శివ పాల్గొన్నారు.

తల్లడిల్లిన తల్లి వానరం

మృతి చెందిన పిల్ల బతుకుతుందేమోనని తాపత్రయం

కేసముద్రం, ఆగస్టు 25: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ రెండో గేటు వద్ద ఆదివారం ఉదయం ఒక తల్లి కోతి అప్పటికే మృతి చెందిన తన పిల్లను తీసుకుని వచ్చింది. పిల్లవానరం ఎలా చనిపోయిందోగాని తన పిల్ల ఎప్పటికైనా లేస్తుందేమోనని తపనతో తల్లి వానరం దాని కళేబరాన్ని తన వెంటనే తీసుకువెళుతోంది. కొద్దిసేపు గేటు వద్ద కళేబరాన్ని ఉంచి పలుమార్లు తట్టి లేపుతూ దీనంగా అరుస్తుండడంతో చూపరులు అయ్యో పాపం అంటూ చలించిపోయారు.


చనిపోయిన పిల్లను లేపుతున్న తల్లి వానరం



బీపీ మండల్‌కు నివాళులర్పిస్తున్న విద్యుత్‌శాఖ బీసీ ఉద్యోగులు

విద్యుత్‌శాఖలోని పదోన్నతులు చట్టవిరుద్ధం

హనుమకొండ టౌన్, ఆగస్టు 25: ఇటీవల విద్యుత్‌శాఖలో చేపట్టిన పదోన్నతులు చట్టవిరుద్ధమని, దీనిపై కోర్టులో సవాల్ చేస్తామని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం టీజీఎస్పీడీసీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కోడెపాక కుమారస్వామి పేర్కొన్నారు. బీసీ ఉద్యోగుల కార్యనిర్వాహక సమావేశం ఆదివారం హనుమకొండలో జరిగింది. ఈ సందర్భంగా బి.పి మండల్ జయంతిని పురస్కరించుకొని నివాళులు అర్పించారు. అనంతరం కుమారస్వామి మాట్లాడుతూ.. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా డిస్కంలు వ్యవహరించాయన్నారు. పదోన్నతులను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 4 న హైద్రాబాద్‌లోని విద్యుత్ సౌధ ఎదుట మహాధర్నా చేయబోతున్నామని, బీసీ ఉద్యోగులంతా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అధ్యక్ష, కార్యదర్శులు నాగెల్లి సదానందం, నీలారపు రాజేందర్, రిటైర్డ్ సీఈ సత్యనారాయణ, కంపెనీ పరిధిలోని 16 జిల్లాల అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారి సన్నిధిలో ఉన్నతాధికారులు



అమ్మవారిని దర్శించుకున్న ఇరిగేషన్ శాఖ అధికారి కె. ధర్మ

వరంగల్ కల్చరల్, ఆగస్టు 25: భద్రకాళి అమ్మవారిని ఆదివారం అధికారులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రాష్ట్రాలకు చెందిన ఆదాయపు పన్ను శాఖ అధికారి ఆనంద రాజేశ్వర్ దంపతులు, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ కె.ధర్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వీరికి ఆలయ ఈవో శేషుభారతి వీరికి అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అయ్ బాబోయ్ ఎంత పొడుగో!

స్టేషన్‌ఘన్‌పూర్‌లో 20 అడుగులు పెరిగిన పచ్చజొన్న కర్రలు



స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 25: సాధారణంగా పచ్చజొన్న కర్రలు ఐదు లేదా ఆరు అడుగులు పెరుగుతాయి. కాని దానికి మూడింతలు ఎత్తు పెరిగిన మొక్కలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ ఎస్సీ కాలనీలో మాజీ ఎంపీటీసీ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు జోగు కుమారస్వామి ఇంటి ఆవరణలో ఈ వింత మొక్కలు పెరిగాయి. రెండు నెలల క్రితం మూడు పచ్చజొన్న మొక్కలు వాటికి అవే మొలకెత్తాయి. రోజు రోజుకూ అవి ఎదుగుతూ 20 నుంచి 22 అడుగులకు చేరుకున్నాయి. వాటిని చూసిన స్థానికులు ఇంత ఎత్తు ఎలా పెరిగాయని ఆశ్చర్యపోతున్నారు. కాగా భూమిలో ఉన్న సారం ప్రకారం అప్పుడప్పుడు ఇలా ఎత్తు పెరుగుతాయని రైతులు చెబుతున్నారు. కాగా, అవి అంత ఎత్తు పెరిగినా ఇంతవరకు కంకి వేయకపోవడం గమనార్హం.



కాజీపేట ఐటీఐ ఏటీసీ కోసం సోమిడిలో కేటాయించిన స్థలం



వాజేడులోని ఐటీఐ ప్రాంగణంలో ఏటీసీ భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

ఐటీఐలకు అధునాతన హంగులు

ఏటీసీల ఏర్పాటుకు మొదలైన భవన నిర్మాణ పనులు ● ఉమ్మడి జిల్లాలో తొలి విడత మూడు ఐటీఐలలో ఏటీసీల ఏర్పాటు
ఒక్కొక్కదాని వ్యయం రూ.40 కోట్లు ● ఐటీఐలకు చేరుకుంటున్న ఏటీసీ ఏక్విప్‌మెంట్

హనుమకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడివరంగల్ జిల్లాలోని మూడు పారిశ్రామిక శిక్షణా సంస్థలు (ఐటీఐ)లలో ఆధునాతన సాంకేతిక శిక్షణా కేంద్రాల ఏర్పాటు పనులు మొదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా 24 ఐటీఐలలో ఏటీసీ భవనాల నిర్మాణం పనులను ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు రోడ్డులోని వరంగల్ ఐటీఐ, భూపాలపల్లి ఐటీఐ, ఏటూరునాగారం ఐటీలలో పనులు మొదలయ్యాయి. ఈఐటీఐలలో చాలినంత స్థలం అందుబాటులో ఉండడంతో వీటిల్లో ఏటీసీ భవనాల నిర్మానానికి శ్రీకారం చుట్టారు. మిగతా మూడు ఐటీఐలలో కూడా స్థలం అందుబాటులోకి రాగానే పనులు చేపడతారు. వర్షాకాలం కావడం వల్ల ఈ మూడు ఐటీఐలలో పనులకు కొంత ఆటంకం కలుగుతోంది. పిల్లర్ల కోసం తవ్విన కందకాలతో వర్షపు నీరు తరుచూ నిండిపోయి పనులు ముందుకు సాగడం లేదు. ఆరు నెలల్లో భవనాల నిర్మాణం పూర్తయితే ఆ వెంటనే అందుల్లో పరికరాలను అమర్చుతారు. వాస్తవానికి ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ ఏటీసీలలో ప్రవేశాలను కల్పించాల్సి ఉంది. కానీ భవనాల నిర్మాణమే పూర్తికాకపోవడంతో వాయిదా పడింది. ఈలోగా ఏటీసీ ఏర్పాటును పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రవేశాలను కల్పించనున్నారు.



ములుగు రోడ్డులోని వరంగల్ ఐటీఐ ప్రాంగణంలో ఏటీసీ భవన నిర్మాణానికి పిల్లర్ల కోసం తీసిన గుంతలు

అధునాతన..

ఐటీలను ఆధునాతన సాంకేతిక శిక్షణా సంస్థలుగా (ఏటీసీ) మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది తెలిసిందే. ప్రభుత్వ ఐటీఐలను ఏటీసీలుగా మార్చేందుకు టాటా టెక్నాలజీ లిమిటెడ్‌తో (టీటీఎల్) ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడంతో వాటి దశ, దిశ మారనున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 65 ఐటీఐలో ఏసీటీలను ఏర్పాటు చేయాలని టీటీఎల్ నిర్ణయం తీసుకున్నది. మొదటి విడతగా 24 ఐటీలను ఏటీసీలను ఏర్పాటు చేయనున్నది. ఇందులోభాగంగా ఉమ్మడి వరంగల్‌లోని మూడు ఐటీఐలో ఏసీటీసీలు ఏర్పాటవుతున్నాయి. టీటీఎల్ ఒక్కొక్క ఏటీసీని రూ. 40కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తోంది. టీటీఎల్ మొత్తం రూ.2,324 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని ఐటీఐలను అప్ గ్రేడ్ చేస్తోంది. ఐటీఐ సర్కిల్ డెవలప్‌మెంట్ అప్‌గ్రేడెషన్ ప్రాజెక్టులో భాగంగా ఈ ఐటీఐలలో ఆదునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇస్తారు. ఇందులో కోసం అధునాతన సామగ్రిని, సాంకేతికతను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక నిపుణులతో ఇందులో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.

చేరుకుంటున్న పరికరాలు

ఒక పక్క భవన నిర్మాణ పనులు జరుగుతుండగానే టీటీఎల్ ఏటీసీలో అమర్చాల్సి ఉన్న యంత్ర పరికాలను ఆయా ఐటీఐలకు పంపడం మొదలు పెట్టింది. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫ్యాక్టరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్, ఆర్టీషియన్ యూజింగ్ అడ్వాన్సుడ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానిక్)కు సంబంధించిన రోబోటిక్స్ మిషన్స్, డిజిటల్ కటింగ్స్ తదితర పరికరాలు వీటిలో ఉన్నాయి. వీటితో పాటు ఏటీసీలో ఒక ఆధునాతన అడ్వాన్సుడ్ టెక్నాలజీతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. ఇందులో 20 సిస్టమ్స్ ఉంటాయి. ఆటోమొబైల్‌కు కోర్సుకు సంబంధించి బ్యాటరీ చార్జెస్ వెహికిల్ కూడా రానున్నది.

సోమిడిలో ఏటీసీ

కాజీపేటలోని ఐటీఐకి అనుబంధంగా కూడా ఒక ఏటీసీ సెంటర్ ఏర్పాటు కానున్నది. అయితే ఇందులో చాలినంత స్థలం అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ పనులు వెంటనే ప్రారంభం కాలేదు. స్థలం కోసం నాలుగైదు చోట్ల పరిశీలించగా చివరికి సోమిడిలో గోదాముల వెనుక గల ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు. ఏటీసీ ఏర్పాటుకు 25 గుంటల స్థలాన్ని హనుమకొండ కలక్టర్ ప్రావీణ్య ఇటీవల కేటాయించారు. స్థలం అప్పగించే ప్రక్రియ పూర్తికాగానే ఇక్కడ కూడా ఏటీసీ భవనం పనులు మొదలుకానున్నాయి.

ఏటీసీల్లో ఆరు కొత్త కోర్సులు

ఐటీఐ విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను తట్టుకొని ఉపాధి అవకాశాలు పొందగలిగేలా వారిలో వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంగా భాగంగా ఐటీఐ సర్కిల్ డెవప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టులో భాగస్వామి అయింది. ఇందులో భాగంగా టీటీఎల్ ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా. ముఖ్యంగా తమ కంపెనీకి సరిపడే వృత్తి నిపుణులను తయారు చేయడానికి ఆరు అధునాతన ట్రేడ్‌లను ఈ ఏసీటీల్లో ప్రవేశపెట్టనున్నది. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫ్యాక్టరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్, ఆర్టీషియన్ యూజింగ్ అడ్వాన్సుడ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానిక్) వీటిలో ఉన్నాయి. ఇండస్ట్రియల్ రొబొటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్‌లో ఒక్కొక దానిలో 40 సీట్లు, మిగతా కోర్సుల్లో 48 సీట్ల చొప్పున ఉంటాయి. ఏటీసీల ఏర్పాటుకు అవసరమైన భవనాలను ఒక్కోక్కదాని రూ. 4.50 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుండగా రూ. 35 కోట్లతో ఏటీసీల్లో ఆధునాతన బోధనా పరికరాలను సమకూరుస్తున్నది.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శ్రీనివాసరావు

సీపీఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కర్రె భిక్షపతి

ప్రకటించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



కర్రె భిక్షపతి

బాలసముద్రం, ఆగస్టు 25: తెలంగాణ కమ్యూనిస్టు రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో మూడు రోజులు అట్టహాసంగా జరిగాయి. ఆదివారం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ఎన్నుకున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆదివారం బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ప్రకటించారు. రాష్ట్ర సీపీఐ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సీపీఐ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె భిక్షపతిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ.. తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్‌లో చేరి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, ఢిల్లీ కేంద్రంగా జాతీయ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. మూడు దశాబ్దాలుగా ప్రజాసమస్యలపై పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులకు జాతీయ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ, రాష్ట్ర నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, బాగం హేమంతరావు, కలవేణ శంకర్, బాలనర్సింహా పాల్గొన్నారు.

నాగేశ్వర్‌రావుకు డాక్టరేట్



ఐనవోలు, ఆగస్టు 25: ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావుకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. సాంస్కృతి సాహితి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించేవారికి డాక్టరేట్ బిరుదును అందజేస్తారు. అందులో భాగంగా ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈవో, కుటుంబ సభ్యులను సన్మానించి బిరుదు పత్రాన్ని దైవాజ్ఞ శర్మ చేతుల మీదుగా అందజేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిస్సా రాష్ట్రాలలో సాంస్కృతిక సాహితి సేవా ట్రస్ట్ సేవా కార్యక్రమాలను నిర్వహించే వారిని ప్రోత్సహించడం సంతోషంగా ఉందని ఈవో సందర్భంగా పేర్కొన్నారు.

నర్సంపేటలో దొంగల హల్‌చల్

● తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ ● రూ. 12లక్షల నగదు, 11తులాల బంగారు నగల అపహరణ



నర్సంపేటలో చోరీకి పాల్పడిన ఇల్లు ఇదే..



ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు, సీఐ రమణమూర్తి

నర్సంపేట టౌన్, ఆగస్టు 25 : నర్సంపేట పట్టణంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడి నగదు, బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లిన ఘటన పట్టణంలో చోటచేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం. నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామంలోని కాకతీయ గురుకుల పాఠశాల కరస్పాండెంట్ మేడవరపు కమలాకర్‌రావు తన కుటుంబంతో నర్సంపేటలోని వరంగల్ రోడ్‌లో వివేకానందకాలనీలో నివాసముంటున్నారు. కమలాకర్‌రావు భార్య అనారోగ్యంతో హైదరాబాద్‌లో తన కుమారుడి వద్ద ఉంటూ చికిత్స పొందుతోంది. కమలాకర్‌రావు తన సహచర ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లో పాఠశాల తరఫున సన్మాన కార్యక్రమం ఉండడంతో శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఇదే రోజు అర్ధరాత్రి ఇంటికి చేరుకోగా ప్రధాన ద్వారం సెంట్రల్ తాళం పగలగొట్టి ఉండడం, లోపలకి వెళ్లగా కప్‌బోర్డు తెరిచి ఉండి, అందులోని నగదు, బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఆదివారం ఉదయం చోరీ విషయాన్ని నర్సంపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏసీపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, సీఐ రమణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం వరంగల్ నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంను పిలిపించి దొంగతనం జరిగిన ఇంటితో పాటు పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చోరీలో రూ. 12 లక్షల నగదు, 11 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు కమలాకర్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణమూర్తి తెలిపారు.

సందడిగా జిల్లా స్థాయి చెస్ పోటీలు

ఉమ్మడి జిల్లాలో 50మంది బాలబాలికలు హాజరు



జిల్లా స్థాయి చెస్ పోటీలను ప్రారంభిస్తున్న క్రీడల కార్యనిర్వాహణ కార్యదర్శి కన్న

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 25: తెలంగాణ చెస్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని రోజరీ పాఠశాలలో జిల్లా స్థాయి అండర్-9 బాల బాలికల చెస్ పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి క్రీడా పోటీల నిర్వాహణ కార్యదర్శి కన్న ముఖ్య అతిథిగా హాజరై చెస్ క్రీడలను లాంచనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెస్ క్రీడలో పాల్గొనడం ద్వారా మేధో సంపత్తి పెంపొందుతుందన్నారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలని ఆశాభవం వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలలో సుమారు 50మంది బాల బాలికలు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సెప్టెంబరు నెల చివరి వారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ సునీల్‌రెడ్డి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మామిడాల కుశాల్‌కు మహా నంది పురస్కారం

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 25: హనుమకొండలోని రాయపుర ప్రాంతానికి చెందిన మామిడాల కుశాల్ నిర్వహించిన సేవా కార్యక్రమాలకు పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలుగు సంస్కృతి సాహితీసేవా ట్రస్టు ఆధ్వర్యంలోనిర్వహించిన కార్యక్రమంలో మహా నంది పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు.


ఆ పత్రికకు 102 ఏళ్లు



నిజాం నిర్బంధకాలంలో ప్రజలను చైతన్యపరిచిన 'తెనుగు' పత్రిక

మారుమూల గ్రామంలో పత్రిక స్థాపించిన ఒద్దిరాజు సోదరులు

రేపు మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో శతాబ్ది వేడుకలు



పత్రిక వ్యవస్థాపకులు ఒద్దిరాజు సోదరులు



ఇనుగుర్తిలోని ఈ ఇంటి నుంచే తెనుగు పత్రిక వెలువడింది

మహబూబాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నిజాం ప్రభుత్వం నిర్బంధం కొనసాగిస్తున్న కాలంలో ప్రజలను చైతన్య పరిచి.. స్వాతంత్రోద్యమ వైపు నడిపించి, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అణిచివేయబడ్డ తెలంగాణ ప్రజలను మెల్కోలిపేందుకు ఒద్దిరాజు సీతారామచందర్‌రావు, రాఘవరంగారావు సోదరులు నడుం బిగించారు. సహజమైన కవులు, రచయితలు కావడం చేత ఆ కాలంలోనే జర్నలిస్టులుగా మారి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మారు మూల గ్రామమైన ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి గ్రామంలో మద్రాసు నుంచి ముద్రణాలయం (ప్రింటింగ్ మిషన్) తెప్పించి, 'తెనుగు' పత్రికకు పురుడు పోశారు. ఆ పత్రిక ద్వారా ప్రజలను చైతన్య పరిచి తెలంగాణ ఉద్యమం వైపుకు నడిపించడంలో కీలక భూమిక పోషించారు. తెలంగాణలోనే మొట్టమొదటి తెలుగు పత్రిక తెనుగు పత్రిక స్థాపించి ఈ నెలతో 102 ఏళ్ల పూర్తి కావొస్తుంది. తన కలాన్ని పదును పెట్టి తెలంగాణ ప్రాంతంలోనే కాకుండా ఇతర ప్రాంతాలకు పత్రికను పంపించి ప్రజలను చైతన్య పరిచారు. ఈ పత్రిక స్థాపించి వందేళ్ల పూర్తయిన నేపథ్యంలో ఒద్దిరాజు సోదరుల కుటుంబసభ్యులు, బంధువులు, ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 27న మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు ప్రముఖ పాత్రికేయులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆ తెనుగు పత్రికపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

'తెనుగు' పత్రికకు శ్రీకారం..

నిజాంలు పాలించిన తెలంగాణ ప్రాంతంలో 1922 వరకు తెలుగు పత్రికలు ప్రారంభం కాలేదు. హైదరాబాద్ నగరం నుంచి 19వ శతాబ్దంలో వెలువడిన కొన్ని అంగ్ల, ఉర్దూ పత్రికలపై నిజాం ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించింది. బ్రిటిష్ పాలకులకు, నిజాం ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే రాతలు ఆ కాలంలో రాయకూడదు. అప్పట్లో ప్రచురితమైన తెలుగు పత్రికలు అనేక నిర్బంధాలకు గురయ్యాయి. ఆంధ్రా ప్రాంతంలో అదే సమయంలో నాటి బందరు నేటి మచిలీపట్నం నుంచి కృష్ణా పత్రిక వెలువడుతుండేది. ఒద్దిరాజు సోదరులు బందరు వెళ్లి మట్నూరి కృష్ణారావును కలిసి తాము కూడా పత్రిక స్థాపిస్తే ఎలా ఉంటుందని, ఇనుగుర్తి గ్రామంలో స్థాపించేందుకు సలహా ఇవ్వాలని కోరడంతో కృష్ణారావు దానికి బాగుంటుందని సలహా ఇచ్చారు. ఒద్దిరాజు సోదరులు ఇనుగుర్తి సొంత గ్రామంలో పత్రికను నడిపేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో నిర్బంధ కాలంలోనే తెలంగాణ ప్రజలను మెల్కోల్పేందుకు ఒద్దిరాజు సోదరులు తెనుగు పత్రికకు శ్రీకారం చుట్టారు. 1922 ఆగస్టు 28న ఈపత్రికను ప్రారంభించారు. పత్రిక ముద్రణకు కావాల్సిన రూ.6వేల విలువైన వార్‌ఫెడిల్ మిషన్, ట్రెడిల్ మిషన్ ఖరీదుచేసి సొంతంగా విజ్ఞాన ప్రచారిణి అనే ముద్రణాలయాన్ని స్థాపించి తెనుగు పత్రిక (వారపత్రిక)గా నడిపించారు.

ప్రజలే చైతన్యంగా..

పత్రికను స్థాపించిన ఒద్దిరాజు సోదరులకు పత్రికను వివిధ గ్రామాలు, పట్టణాలు, రాష్ట్రాలకు పంపించేందుకు సమస్యగా మారింది. వారానికి రెండ్రోజులు మాత్రమే వెలువడే ఈ తెనుగు పత్రికను నిజాం నిరంకుశ ప్రభుత్వ పాలన కింద సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణిచివేయబడుతున్న తెలంగాణ ప్రజలను మెల్కోలిపే వార్తలను ఒద్దిరాజు సోదరులు ప్రచురించే వారు. స్వాతంత్రోద్యమ కాలంలో ఇలాంటి వార్తలకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. అలాంటి వార్తల పత్రికను ఇనుగుర్తిలో పోస్టాఫీస్ లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు తరలించే వీలు లేకుండాపోయింది. దాంతో ఒద్దిరాజు సోదరులు హైదరాబాద్‌కు వెళ్లి పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులను కలిసి గ్రామానికి పోస్టాఫీసును మంజూరు చేయించారు. పత్రికకు వార్తలు, వ్యాసాలు రాసేందుకు, చందాదారులుగా చేర్పించడానికి, చేరడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో వారే స్వయంగా హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, సూర్యాపేట, విజయవాడ, బందరు, చెన్నై, మానుకోట ప్రాంతాల్లో తిరిగి సంవత్సరం చందా దారులను తయారు చేసి పోస్టాఫీసు ద్వారా పత్రికను చేరవేసేవారు. నాటి కాలంలో ఆ పత్రికకు సంవత్సరపు చందా మూడు రూపాయలే. వారానికి 500 కాపీలను ముద్రించి పోస్టు ద్వార చందాదారులకు పంపేవారు. ఈ పత్రికకు మంచి స్పందన రావడం తో హైదరాబాద్ నుంచి బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమం తరావు, వెంకటేశ్వర్‌రావు, కోదాటి రామకృష్ణారావు లాంటి ప్రముఖులు కూడ ఈ తెనుగు పత్రికకు వార్తలు పంపడం విశేషం.

ప్రముఖుల వ్యాసాలు..

ఒద్దిరాజు సోదరుల బంధువైన నల్గొండకు చెందిన షబ్నాలిస్ వెంకటనర్సింహారావు ఒద్దిరాజు సోదరుల సలహాతో 1923లో నల్గొండలో 'నీలగిరి' అనేక పత్రికను స్థాపించారు. ఏడాది పాటు ఇనుగుర్తిలోనే వద్దిరాజు సోదరుల ప్రింటింగ్ ప్రెస్‌లో ఆ పత్రిక ప్రింటింగ్ చేసి నల్గొండకు పంపించేవారు. అయితే రజాకార్ల సమయంలో బహుముఖ కవి, రచయితలు కావడంచేత అనేక గ్రంథాలు రాశారు. ఒద్దిరాజు సోదరులు రాసిన చాలా గ్రంథాల్లో కొన్నింటిని ప్రచురించగా, చాలా వరకు ప్రచురించలేకపోయారు. చేతివృత్తులపై వారు రాసిన అనేక కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ సోదరులు రాసిన సౌదామిని పరిణయం అనే గ్రంథం నుంచి కొంత భాగాన్ని కాకతీయ యూనివర్సిటీ కూడా సేకరించి దాన్ని పాఠ్యాంశంగా మార్చి విద్యార్థులకు బోధన చేశారు. రజాకార్లు ఇనుగుర్తిలోని ఒద్దిరాజు సోదరుల ఇంటికి వెళ్లి వారు రాసిన అనేక గ్రంథాలను తగలబెట్టడంతో పాటు విలువైన సామగ్రిని ధ్వంసం చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఒద్దిరాజు సోదరులు ఆ తర్వాత పత్రికను వరంగల్ జిల్లా కేంద్రానికి మార్చారు. అయితే కొన్ని నెలల వరకే పత్రిక నడిచి పలు కారణాలతో ప్రచురణ ఆగిపోయింది. పత్రిక నిలిచి పోయింది. కాగా, ఒద్దిరాజు సోదరులు నివసించిన, పత్రిక నిర్వహించిన భవనం ప్రస్తుతం ఎవరూ లేకపోవడంతో పూర్తిగా శిధిలావస్థకు చేరుకుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తెలంగాణలో మొట్టమొదటి తెలుగు భాషలో వెలువడిన తెనుగు పత్రిక స్థాపించిన ఈ భవనానికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

27న ఇనుగుర్తిలో శతాబ్ది వేడుకలు..

ఇనుగుర్తి గ్రామానికి చెందిన ఒద్దిరాజు సీతారామచందర్‌రావు, రాఘవ రంగారావు కలిసి తెలంగాణలో తెనుగు పత్రికను స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 27న ఇనుగుర్తి రైతు వేదికలో శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఒద్దిరాజు సుభాష్ తెలిపారు. ఈ వేడుకలకు ప్రముఖ పాత్రికేయులు, ఒక దినపత్రిక సంపాదకుడు దేవులపల్లి అమర్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులకు కూడా సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సుభాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయుల సంఘాల బాధ్యులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాజర్నలిస్టులు పాల్గొని, విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి

గిర్మాజిపేట, ఆగస్టు 25: సికింద్రాబాద్ నుంచి వరంగల్ వస్తున్న రైలు నుంచి జారి పడి మహిళ మృతిచెందిన ఘటన హంటర్ రోడ్డు శాయంపేట రైల్వేగేటు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ కథనం ప్రకారం. హనుమకొండ లష్కర్‌బజార్‌కు చెందిన సాదియా(42) 4 నెలలుగా సికింద్రాబాద్ లాలాగూడలో కుమారుడు సల్మాన్, కూతురు సల్మాతో ఉంటోంది. ఆదివారం తెల్లవారుజామున సికిందరాబాద్ నుంచి వరంగల్‌కు రైల్లో వస్తున్న సాదియా శాయంపేట రైల్వేగేటు వద్ద రైలు నుంచి జారి పట్టాలపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా సాదియాగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి, ఎంజీఎం మార్చురీకి తరలించారు. సాయంత్రం మృతదేహాన్ని లష్కర్‌బజార్‌లోని మృతురాలి తల్లి రహమున్నీసా బేగంకు అప్పగించి ఎస్సై మోహినుద్దిన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుబ్బగూడెంలో భారీగా నల్లబెల్లం పట్టివేత

- 60 క్వింటాళ్ల బెల్లం, 2 క్వింటాళ్ల పట్టిక స్వాధీనం
- డీసీఎం, రెండు ద్విచక్రవాహనాలు, ఆటో సీజ్

గూడూరు, ఆగస్టు 25 : దుబ్బగూడెం, చిల్లగండి తండాల్లో ఆదివారం భారీ మొత్తంలో నల్లబెల్లం, పటిక, గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.బిక్షపతి తెలిపారు. ఎక్సైజ్ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమలహాసన్‌రెడ్డి, వరంగల్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌కుమార్ ఆదేశాల మేరకు గూడూరు మండలం దుబ్బగూడెం, చిల్లగండి తండాల్లో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో 60 క్వింటాళ్ల నల్లబెల్లం, 2 క్వింటాళ్ల పటిక, 60 లీటర్ల గుడుంబా లభ్యమైనట్లు చెప్పారు. వాటిని తరలించేందుకు వినియోగించిన డీసీఎం వ్యాన్, రెండు ద్విచక్రవాహనాలు, ఆటోట్రాలీని సీజ్ చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా



గూడూరులో పట్టుబడిన నల్లబెల్లం, తరలించేందుకు ఉపయోగించే వాహనాలను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

నుంచి దుబ్బగూడెంకు బెల్లంను తీసుకువచ్చి కొంత మొత్తాన్ని డంప్‌చేసి మరికొంత మొత్తాన్ని మహబూబాబాద్ మండలం కొమ్ముగూడెం తరలించేందుకు సిద్ధమవుతుండగా పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించిన స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందుకు బాధ్యులైన మహబూబాబాద్ మండలం కొమ్ముగూడెంకు చెందిన భూక్య భావ్‌సింగ్, గూడూరు మండలం లైన్‌తండాకు చెందిన బానోత్ దేవ్‌సింగ్, అజ్మీరా సూర్య, దుబ్బగూడెంకు చెందిన అజీరా చిన్నా, లక్ష్మణ్‌తండాకు చెందిన లావుడ్యా బాలు, చిల్లగండి తండాకు చెందిన గుగులోతు జ్యోతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడపకు చెందిన మీసాల వెంకటరమణ, డెరంగుల శివకుమార్‌లను అదుపులోకి తీసుకుని విచారించి, కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ బిక్షపతి తెలిపారు. అనంతరం భారీ మొత్తంలో నల్లబెల్లం, పటికను పట్టుకున్న ఎక్సైజ్ సీఐ బిక్షపతితో పాటు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

ఈ దాడుల్లో ఎస్సై రాజేశ్వరి, హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య, సిబ్బంది సుధాకర్, నరేష్, వెంకన్న, బాలకృష్ణ, దేవేందర్, యుగేందర్, గద్దర్, సాయిరాం, మనోజ్,మల్లికార్జున్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

తొర్రూరు ఎస్‌బీఐ బ్యాంకులో విద్యుదాఘాతం

- కాలిబూడిదైన రెండు కంప్యూటర్లు
- ఆందోళనలో రైతులు, మహిళా సంఘాలు

తొర్రూరు, ఆగస్టు 25 : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తొర్రూరు బ్రాంచిలో ఆదివారం విద్యుదాఘాతంతో రెండుకంప్యూటర్లు కాలి బూడిదైన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు కథనం ప్రకారం. ఆదివారం బ్యాంకు ఉద్యోగులు కింది అంతస్తులో పెండింగ్ ఫైల్స్ వర్క్ చేస్తున్నారు. మొదటి అంతస్తు నుంచి పొగలు వచ్చి బయటకు కాలిపోయిన వాసన వచ్చింది. దీంతో గుర్తించిన స్థానికులు, బ్యాంకు సిబ్బందిపై అంతస్తుకు వెళ్లి చూడగా కంప్యూటర్, సీపీయూ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దాంతో పాటు మరో కంప్యూటర్ కూడా అంటుకుంది. అలాగే గ్లాసులు, టేబుల్స్‌పై ఉన్న ఫైల్స్ దహనమయ్యాయి. కొంత మేరకు ఫర్నీచర్ కూడా కాలిపోయిందని బ్యాంకు సిబ్బంది తెలిపారు. బ్యాంకులో కంప్యూటర్లు కాలిపోయి పొగలు రావడంతో ఇటీవల ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించడంతో తమ వివరాలు ఉన్నాయో కాలిపోయాయని బ్యాంకుకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ బ్యాంకులోనే మహిళా సంఘాల రుణాల్లో అవకతవకలు జరుగగా సంబంధిత అధికారిని బ్యాంకు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆ కేసు కొనసాగుతోంది. సంబంధిత వివరాలు కాలిపోతే తాము నష్టపోతామని మహిళా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కన ఉన్న కంప్యూటర్లకు మంటలు అంటుకుంటే ఆ వేడికి స్ట్రాంగ్‌రూంకు మంటలు వ్యాప్తి చెందే ప్రమాదం తప్పడంతో బ్యాంకు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు, ఫైర్ సెఫ్టీ సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పారు. నష్టాన్ని అంచనా వేస్తున్నామని బ్యాంకు కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని మేనేజర్ చారి తెలిపారు.

1న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 25 : జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడి ఎన్నిక సెప్టెంబరు 1న ఉంటుందని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు నాళ్ల లక్ష్మీనర్సింహరావు ఆదివారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నియమావళి ప్రకారం2024-26 సంవత్సరాలకు గాను ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల ఆర్యవైశ్యలందరు ఈ నెల 30న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వ్యక్తిగతంగా గాని ఆర్గనైజేషన్ పొందిన వ్యక్తి ద్వారా గాని నామినేషన్ ఫారం తీసుకొనుట, సమర్పించుట, నామినేషన్ల పరిశీలన అనంతరం నికర జాబితా ప్రకటన ఉంటుందన్నారు. 31న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉపసంహరణ ఉంటుందని అనంతరం నికర జాబితా ప్రకటన ఉంటుందన్నారు. సెప్టెంబరు 1న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం పోలింగ్ ఉంటుందని, మధ్యాహ్నం 3 గంటల నుంచి కౌంటింగ్ ఉంటుందని అనంతరం తుది ఫలితం వెలువరించనున్నట్లు లక్ష్మీనర్సింహరావు తెలిపారు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఎన్నికలు నిర్వహించబడునని లక్ష్మీనర్సింహరావు తెలిపారు. తొర్రూరు డివిజన్‌కు చెందిన వారు మాత్రమే నామినేషన్ వేసేందుకు అర్హులన్నారు

ముకుందా.. ముకుందా..

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమం అందరు కలిసి పాల్గొనడం వారి లోని ఐక్యతను పెంచుతోంది. ఈ వేడుకల్లో యాదవులతో పాటు ఇతర కులస్థులు సైతం పాల్గొని పండుగను ఘనంగా జరుపుకుంటారు.

ఈ రోజు ఏ వస్తువులు దానం చేయాలంటే..

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన శ్రావణమాసం కృష్ణపక్షంలోని అష్టమి తిథిరోజున ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం ద్వారా కుటుంబంలో ఆహార సమస్యలేకుండా ఉండేందుకు ఉపయోగపడుతుంది. వెన్నదానం చేయం వలన దోషాలు తొలగిపోయి కుటుంబంలో శాంతి, సంతోషాలు నెలకొంటాయి. వస్త్రదానం చేయడం ద్వారా దుఃఖం, పేదరికం నుంచి ఉపశమనం పొందుతారు. నెమలి ఈకలు దానం చేయడం చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయి వృత్తి, వ్యాపారులలో పురోగతి ఉంటుంది.

ఏ రాశుల వారికి అదృష్టం అంటే..

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన కర్కాటక రాశిలో బుధుడు ఉదయించనున్నాడు. కృష్ణాష్టమి రోజున ఇది ప్రారంభం కానుంది. అప్పటి నుంచి తులారాశి వారు చేసే పనులకు ప్రతిఫలం పొంది వారి ఆదాయం మెరుగుపడుతుంది. మిధునరాశి వారికి ఆకస్మిక సంపద వచ్చే అవకాశం ఉంటుంది. కుటుంబంలో బంధం మెరుగుపడుతుంది. వ్యాపారాలు విస్తరించుకోవచ్చు.

అష్టఘడియలు ఎప్పటి నుంచి ఎప్పటి వరకు..

ఆగస్టు 26 (సోమవారం) ఉదయం 8 గంటల 40 నిమిషాల తర్వాత అష్టమి ఘడియలు ప్రారంభమై.. 27 మంగళవారం ఉదయం 6 గంటల 49 నిమిషాలకు అష్టమి ఘడియలు ముగియనున్నాయి. శ్రీకృష్ణుడి జన్మనక్షత్రం రోహిణి నక్షత్రం ప్రారంభం సమయం సోమవారం రాత్రి 9 గంటల 23 నిమిషాలకు ప్రారంభమై, మంగళవారం రాత్రి 8 గంటల 30 నిమిషాలకు ముగియనుంది.

ఆర్యవైశ్య అభ్యున్నతికి కృషి చేస్తా

- పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, ఆగస్టు 25 : సమాజంలో పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటు పడుతున్న ఆర్యవైశ్యుల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం ఆర్యవైశ్య సంఘాలు, వాసవీ క్లబ్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని బృందావన్‌గార్డెన్స్‌లో శ్రావణమాస వనభోజనాల ప్రత్యేక కార్యక్రమానికి ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు బిజ్జాల అనిల్‌కుమార్ అధ్యక్షత వహించగా, ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ఆర్యవైశ్యులు ముందుంటారని కొనియాడారు. సంఘలు ఏర్పాటు చేసుకొని సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే దంపతులను ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగేటి అశోక్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొద్దుటూరి గౌరీశంకర్, వజినేపల్లి అనిల్‌కుమార్, మచ్చ సోమయ్య, మచ్చ సురేష్, వల్లపు మధు, చలువాది సత్యనారాయణ, సామ రాంమూర్తి, క్లబ్ ప్రతినిధులు గార్లపాటి శ్రీనివాస్, గంప



సమావేశంలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి

సాంబమూర్తి, వడియాల నవీన్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం

కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. విదేశీ పర్యటన ముగించుకొని ఆదివారం నేరుగా తొర్రూరుపట్టణానికి రాగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గ సీనియర్ నాయకులు పెదగాని సోమయ్య, సుంచు సంతోష్, సోమరాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ రామచంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుట్టుగా దందా!

(5వ పేజీ తరువాయి)

స్థానికంగా గుడుంబా తయారు చేస్తుండగా, ఇతర ప్రాంతాల్లో గుడుంబా కాచి, ద్విచక్రవాహనాలపై మండలాల్లోకి సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.

ఏజెన్సీలో గంజాయి వాసన

కొత్తగూడ, గంగారం మండలాల్లో గంజాయి చాపకింద నీరులా ప్రవేశిస్తోంది. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు తరచూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నప్పటికీ మండలంలో గంజాయికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. కొందరు గంజాయి రవాణాను వ్యాపారంగా మార్చుకుని దందా కొనసాగిస్తున్నారు. యువకులను లక్ష్యంగా చేసుకుని వారికి గంజాయి రవాణా చేస్తూ లక్షలు గడిస్తున్నారు. గతంలో కొత్తగూడ మండలానికి చెందిన ఇద్దరు యువకులు తొర్రూరులో గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు చిక్కారు. గతంలో కొత్తగూడ మండల కేంద్రంలో బొడ్రాయి వద్ద యువకుడికి గుర్తుతెలియని వ్యక్తి గంజాయి అందిస్తుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా, సదరు యువకుడికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలా.. ఏదో ఒక మూల గంజాయి ఏజెన్సీలో గుప్పుమంటూనే ఉన్నాయి.

పోలీసులు ఏం చేస్తున్నట్లు?!

ఏజెన్సీ మండలాల్లో పలు రకాల అక్రమ, నిషేధిత సరుకుల రవాణా జరుగున్నప్పటికీ స్థానిక పోలీసులు ఏం చేస్తున్నారని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. దందాల గురించి ఆయా గ్రామాల ప్రజలు సమాచారం ఇస్తున్నప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. అక్రమ రవాణాదారుల నుంచి నెలవారీగా వస్తున్న మామూళ్లమత్తులో మునిగి చూసీచూడకుండా వదిలేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ స్పందించి కొత్తగూడ, గంగారం మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ వ్యాపారాలు, మత్తు పదార్థాల విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

'బీసీలకు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను రిజర్వుడ్ చేయాలి'

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 25 :బీసీలకు చట్టసభల్లో ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను రిజర్వుడ్ చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రకార్యదర్శి శంతన్ రామరాజు డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో ఆదివారం బిందెశ్వరి ప్రసాద్ బీపీ మండల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లకు ఆద్యుడైన బీపీ మండల్ తన లక్ష్య సాధనలో ముఖ్యమంత్రి పదవీని సైతం త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. పార్లమెంట్ సభ్యుడిగా, బీసీ కమిషన్ సభ్యులుగా కొనసాగిన బీపీ మండల్ తన జీవితాంతం వెనుకబడిన వర్గాల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి చెప్పారు. ఈ కార్యక్రమంలో గంధసిరి బాలరాజు, గంధసిరి వేణు, దూదిమెట్ల మోహన్‌రావు, తాళ్లపల్లి కమలాకర్, రమేష్ పాల్గొన్నారు.

ఫెస్టిసైడ్స్ ఫీల్డ్ స్టాఫ్ కమిటీ ఎన్నిక



గండి శ్రీనివాస్ అధ్యక్షుడు

కేసముద్రం, ఆగస్టు 25 : మండల సీడ్స్, ఫెస్టిసైడ్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఫీల్డ్ స్టాఫ్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా గండి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ముదిగిరి సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా కంచ అశోక్, కోశాధికారిగా భూక్య రమేష్, సహాయ కార్యదర్శిగా కత్తుల లింగస్వామిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు, డీలర్లు, కంపెనీకి మధ్య అనుసంధాన కర్తలుగా ఫీల్డ్ స్టాఫ్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఫీల్డ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం

కేసముద్రం, ఆగస్టు 25 : కేసముద్రం విలేజి గ్రామానికి చెందిన మలిశెట్టి వీరయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన దహన సంస్కారాలకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిలువేరు సమ్మయ్యగౌడ్ రూ.8వేలను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రంశెట్టి అశోక్, వల్లందాస్ రవి, తుంపిళ్ల వెంకన్న, రాంబాబు, చిట్ల సోమన్న, కొండేటి కళాధర్, బెజ్జం నాగన్న, రబ్బాని, గుంషావలి పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆదిదేవా వెల్ఫేర్ ప్రధాన కార్యదర్శి మంచెన శ్రీనివాస్

కేసముద్రం, ఆగస్టు 25 : మండల కేంద్రంలో వచ్చేనెలలో జరిగే గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంచెన శ్రీనివాస్ కోరారు. స్థానిక శ్రీరామమందిరంలో ఆదివారం ఆ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘంలో 502 మంది సభ్యులతో రూ.1.25 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రావుల మురళి, వోలం మురళి, బండారు దయాకర్, బచ్చు పరమేశ్వర్, కన్న యాకయ్య, ముత్యాల శివకుమార్, లక్ష్మీనారాయణ, ఎండీ.రఫీ, గుగులోత్ వీరునాయక్, తోట మధు, నిర్వాహకులు తేరాల శ్యాం, ఎండీ.షబ్బీర్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 25 : ఎన్నికల హామీల్లో భాగంగా రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుగులోతు రాములునాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రం శనిగపురం శివారు బోడతండ, పాతతండాల్లో రైతులతో కలిసి పత్తి తోటలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు రైతులను తప్పుదొవ పట్టించే విధంగా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బోడ ఫూల్‌సింగ్, బోడ హరినాయక్, ఈర్య బోజ్యా, మాన్‌సింగ్, రైతులు పాల్గొన్నారు.

'దోషులను కఠినంగా శిక్షించాలి'



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్డీ జిల్లా నాయకులు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 25 : కలకత్తాలో జూనియర్ డాక్టర్ మౌనికను అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చారి హరీష్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మండలం బ్రహ్మణపల్లి లక్ష్మీపురంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ఈనెల 9న కలకత్తా ప్రభుత్వ ఆర్జీకార్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మౌనికపై అత్యాచారంకు పాల్పడి హత్య చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘాతుకాలకు పాల్పడే నరరూపరాక్షసులను బహిరంగా శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బండారి మహేష్, ఆసీఫ్, శ్రీకాంత్, రాజ్‌కుమార్, ఎల్లేష్, విజయ్, సుందర్, బన్నీ, మురళి, ముఖేష్, శివ, నవీన్, చరణ్ పాల్గొన్నారు.



ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన అడ్‌హాక్ కమిటీ బాధ్యులు

జిల్లా ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 25 : జిల్లా ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో జిల్లా అధ్యక్షుడుగా గండు మురళీ, ప్రధానకార్యదర్శిగా చేపూరి రవి, కోశాధికారిగా మాశెట్టి రాంబాబు, ఉపాధ్యక్షులుగాకావటి లక్ష్మణ్, ఎ.రాజశేఖర్, ఎస్కె. గౌస్‌పాష, సుధాకర్, సంయుక్త కార్యదర్శులుగా జి.అశోక్, కుమార్, యాకయ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా శరత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 25 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జమాండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలప్రధానోపాధ్యాయులు ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జిల్లా యోగా స్పోర్ట్స్ చాంపియన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ పోటీల్లో 150 మంది పాల్గొన్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పుష్పలీల, నరేష్ తెలిపారు. ఇందులో 20 మంది బాలురు, 20 మంది బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ప్రోగ్రాం అధ్యక్షుడిగా కె. గిరిజ, అబ్జర్వర్‌గా పి.రాము, అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

'యోధుల జీవిత చరిత్రను సినిమాగా తీయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సేనాపతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 25 : స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను సినిమాగా తీయాలని సినిమా నిర్మాణ కమిటీ జిల్లా చైర్మన్ గుగులోతు సక్రు, దొడ్డి కొమురయ్య సినిమా దర్శకుడు సేనాపతి అన్నారు. ఆదివారం మహబూబాబాద్‌లో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ సన్నాహక సమావేశంలో స్వాతంత్ర్య సమరయోధుడు, రైతాంగ పోరాట యోధుడు రాపర్తి యాదగిరి చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించి వారు మాట్లాడుతూ దగాపడ్డా జనం నుంచి మొదలైన ఈ తిరుగుబాటు వాతావరణాన్ని ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించి, వారి ప్రాణత్యాగాన్ని, ఆశయాలను సజీవపర్చడమే సినిమా ఉద్దేశమన్నారు. జిల్లా నుంచి సహకమిటీ నిర్మాతలు కవిత, దాసరి నాగమణి, లింగంపల్లి దయానంద్, వట్టం ఉపేందర్, అప్పర్తి సైదులు, కెప్రసాద్ చేరగా ఈ కార్యక్రమంలో సినీ నిర్మాణ కమిటీకో చైర్మన్ పప్పుల శ్రీనివాసరావు, నాగలక్ష్మీ, ఖమ్మం జిల్లా చైర్మన్ షేక్ అబ్దుల్‌రహీం, తెలంగాణ తొలిదశఉద్యమకారుడు డోలి సత్యనారాణ, తెలంగాణ రాష్ట్ర సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పార్నంది రామయ్య, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

తొర్రూరు, ఆగస్టు 25 : రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మరో మారు మోసం చేసిందని అర్హులైన వారికి రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ నలభై శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని రైతులందరికి ఒకేసారి రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్‌పార్టీ రైతులను మోసం చేసిందన్నారు. పార్టీ నాయకులు మంగళపెల్లి శ్రీనివాస్, తూర్పాటి అంజయ్య, బిందు శ్రీనివాస్, కర్నె నాగరాజు, మణిరాజ్, రాయిశెట్టి వెంకన్న, కుర్ర శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, ఉపేందర్, వివిధ గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- కురవి : అర్హులైన రైతులందరికి రుణమాఫీ వర్తింప చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి నాగేశ్వర్‌రావు అన్నారు. కురవిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన మహబూబాబాద్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



చిన్నగూడూరు, ఆగస్టు 25 : ప్రమాదవశాత్తు చెరువులో పడివ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చిన్నగూడూరులో చోటు చేసుకుంది. ఎస్సై ఝాన్సీ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామపంచాయతీ అవుట్సోర్సింగ్ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న చిన్నగూడూరు గ్రామానికి చెందిన గంగరబోయిన యాకయ్య (65) ఈనెల 23 సాయంత్రం తుమ్మడి చెరువులో చేపల వేటకు వెళ్ళగా, వల కాళ్లకు చుట్టుకొని ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతురాజ్య స్థాపనే కిసాన్ పరివార్ లక్ష్యం

కురవి, ఆగస్టు 25 : రైతు రాజ్య స్థాపనే కిసాన్ పరివార్ లక్ష్యమని సీఈవో డాక్టర్ వివేక్ అన్నారు. చింతపల్లి టోల్‌ప్లాజా సమీపంలో ఆదివారం ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం కందికొండ లక్ష్మీనర్సింహా ఫంక్షన్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కిసాన్‌పరివార్ అధినేత భోపాల్‌నాయక్ హామీ ప్రకారం కురవి మండలంలో ఫుడ్‌ప్రాసెసింగ్‌యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం కలకత్తా ఘటనలో మృతి చెందిన డాక్టర్ మౌనిక మృతికి సంతాపం ప్రకటించారు. విష్ణునాయక్, గుగులోతు భీమానాయక్, అధ్యక్షతన జరిగినఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సురేష్, హరిబాబు, ఎడెల్లి వెంకన్న, వెంకటేశ్వర్లు, గణేష్, రాంమ్మూర్తి, శంకర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపూర్వం



1999-2000 టెన్త్‌బ్యాచ్ పూర్వ విద్యార్థులు

మరిపెడ, ఆగస్టు 25 : పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మరిపెడబంగ్లాలోని కరుణ మినీ ఫంక్షన్‌హాల్‌లో అపూర్వంగా జరుపుకున్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మాదిరిపురంలోని మిషనరీ స్కూల్‌కు చెందిన 1999-2000 టెన్త్‌బ్యాచ్ విద్యార్థులు 24 ఏళ్ల తర్వాత ఒక్కచోట సమావేశమై తమ చిన్ననాటి స్మృతులను నెమరేసుకున్నారు. బాగోగులను ఒకరికి ఒకరు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్నప్పటి తీపి, చేదు జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంబురపడిపోయారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు ప్రేమలత, ఉషా, కనికర దాసు, క్రిష్టఫర్, క్రిష్‌లను మెమొంట్లతో సత్కరించారు. పూర్వ విద్యార్థులు బుచ్చిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నల్లు శ్రీకాంత్‌రెడ్డి, బొమ్మ వెంకన్న, అశోక్, రమేశ్, రామన్న, కృష్ణ, రాణి, విజయశాంతి, కళ్యాణి, రెహనా, రాజ్యలక్ష్మీ, రాధిక, పుష్ప, సౌజన్య, లావణ్య, వసంత, సునీత, ప్రభ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఇల్లెందు ఎమ్మెల్యే పరామర్శ

గార్ల, ఆగస్టు 25 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలు దశదిన ఖర్మలకు ఆదివారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై, వారి కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్ర పటాలకు పూలమాల వేసిఘనంగా నివాళులర్పించారు. మంగ్రిగూడెంలో జాటోత్ కృష్ణ, గార్ల మండలకేంద్రంలో పందుల సీతమ్మ కుటుంబసభ్యులను పరామర్శించి, మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, నాయకులు కోలాకుమార్‌గౌడ్, ఎద్దుల కృష్ణయ్య, చిలకబాబు, చాంద్‌మాల్, కుటుంబరావు, అశోక్, డి.రామారావు, మన్నేపల్లి, వెంకయ్య, కట్టా శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించే విధంగా పోరాటం

- ప్రొఫెసర్ చిన్న సోమన్న

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 25 : ప్రజాస్వామ్యాన్ని రక్షించే విధంగా పోరాటాలు ఉండాలని ప్రొఫెసర్ చిన్న సోమన్న అన్నారు. మహబూబాబాద్‌లోని మదర్‌థెరిస్సా సెంటర్ నుంచి గంగాపుత్ర భవనం వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించి బామ్‌సెఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం విరజిల్లాలంటే ప్రతి అట్టడుగు వర్గానికి, పేద కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాటాలు నిర్వహించాలన్నారు. బలహీనవర్గాలకు రాజ్యాధికారం దక్కాలంటే ప్రతీ ఒక్కరు ఉద్యమించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బామ్‌సెఫ్ రాష్ట్ర అధ్యక్షులు బుర్ర గోవర్దన్, విజయకుమారి, సోమ్లు, బోడ లక్ష్మణ్, భూక్య వీరన్న, దర్శనం రామకృష్ణ, భూక్య సురేష్, నాగరాజు, డోలి సత్యనారాయణ, పొక్కుల సదానందం, శ్రీధర్ పాల్గొన్నారు.